క్లుప్తంగా

బీటీ రోడ్డు మంజూరుకు వినతి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

హత్నూర (సంగారెడ్డి): బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంగళవారం ఎంపీ రఘునందన్ రావును కలిసి కొత్తగూడెం గ్రామ నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. చింతల్చేర్వు నుంచి నాగరం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ ఆధ్వర్యంలో ఎంపీని కోరామని తెలిపారు. ఎంపీ రఘునందన్‌రావు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీరుడి అశోక్, కొత్తగూడెం బీజేపీ నాయకులు వీరాస్వామి, బానోత్, రాజు, ఆంజనేయులు, శివకుమార్, నవీన్, మహేశ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

సంగారెడ్డి టౌన్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి జంగారెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డిలో సహాయక సంఘాలకు ఆడిట్ విషయంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు మార్చి 31 నాటికి ఆడిట్‌ను పూర్తి చేసి సీఆర్పీలు వచ్చేసరికి సిద్ధంగా ఉంచాలని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి 12 మండలాల సీఆర్పీలు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో డీఎంఏలు, ఏపీఎంలు, ఆడిటర్లు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

ఝరాసంగం(జహీరాబాద్): నూతనంగా నిర్మించిన వీరభద్రేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలను గ్రామస్తులు ఊరేగించారు. మంగళవారం మండలంలోని కక్కర్‌వాడ గ్రామంలో వీరభద్రేశ్వర విగ్రహాలను డప్పుచప్పుళ్ల, శివసత్తుల పూనకాలు, శివనామస్మరణ మధ్య ఊరేగింపు సాగింది. పురంతస్వాముల దండకాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. ఆలయంలో విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

'అఖండ నామ సప్త భజన' ప్రారంభం



ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెంకటపూర్ హనుమాన్ ఆలయంలో మంగళవారం అఖండ నామ సప్త భజన కార్యక్రమం ప్రారంభమైంది. భజన భక్తబృందం సభ్యులు ప్రత్యేక పూజలు చేసి పాటలను ప్రారంభించారు. వారం రోజుల పాటుగా భజన కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సంగారెడ్డి క్రైమ్: పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన సంఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ కథనం ప్రకారం.. పట్టణంలోని బాబానగర్‌కు చెందిన యువకులు ఓ ఇంట్లో, పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 6000 నగదును స్వాధీనం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైన పేకాట ఆడినట్లు తెలిస్తే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ హెచ్చరించారు.

పన్ను వసూళ్లలో బొల్లారం టాప్

జిల్లా ప్రథమం.. రాష్ట్రంలో 12వ స్థానం

- పన్నువడ్డీపై రాయితీ, వన్‌టైం సెటిల్ మెంట్ పథకం దోహదం
- రూ.15.98 కోట్లకు.. రూ.14.8 పన్ను వసూలు
- 15వ ఆర్థిక సంఘంలో అర్హత పొందిన బొల్లారం



బొల్లారం మున్సిపాలిటీ కార్యాలయం

జిన్నారం(పటాన్‌చెరు): ఆస్తిపన్ను వసూళ్లలో బొల్లారం మున్సిపాలిటీ జిల్లాలో ప్రథమం, రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో క్షేత్రస్థాయిలో ప్రణాళికా బద్ధంగా పన్ను వసూలు ప్రక్రియ కొనసాగింది. దీంతో జిల్లాలో ప్రథమ స్థానానికి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన పన్నువడ్డీ రాయితీ, వన్ టైం సెటిల్‌మెంట్ వంటి వెసులుబాటు కల్పించడంతో పన్ను వసూళ్ల జోరందుకుంది. బొల్లారం మున్సిపాలిటీలో ఎక్కువ సంఖ్యలో పరిశ్రమలు ఉండడం, ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంతో వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించారు.

88 శాతం వసూళ్లతో ప్రథమ స్థానం

2025–26 సంవత్సరానికి ముందస్తు పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ చెల్లింపుపై అధికారులు స్థానికంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో వినియోగదారులకు ఊరట కలిగింది. ఏళ్ల తరబడి బకాయిలో ఉన్న పన్నులు సైతం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెల్లించారు. మున్సిపాలిటీలో రూ.15.98 కోట్ల పన్ను గాను రూ. 14.8 కోట్ల పన్నులు వసూలు చేయడం జరిగింది. దీంతో 88 శాతానికి చేరింది. ఈ సందర్భంగా జిల్లా లో మొదటి స్థానానికి చేరే దిశగా కృషి చేసిన కమిషనర్ మధుసూదన్ రెడ్డిని సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు.



ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి

సమన్యాయంతో విజయం



ఆస్తిపన్ను వసూళ్ల ప్రక్రియపై ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు చేపట్టడం, అధికారులు సమన్యాయం పాటించడం ప్రధాన కారణం. గత ఏడాదికి, ప్రస్తుత సంవత్సరానికి ఆస్తిపన్ను వసూళ్లలో 12 శాతం పెరగడంతో బొల్లారం మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘంలో అర్హత పొందింది. దీంతో ప్రతి ఏడాది సుమారు 2 కోట్ల నిధులు అదనంగా రానున్నాయి.

–మధుసూదన్ రెడ్డి, బొల్లారం మున్సిపల్ కమిషనర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ



ఇందిరమ్మ ఇళ్ల పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని సాధుతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభయ్యాయి. మంగళవారం మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్, ఎంపీడీఓ సత్తయ్య పనులను పర్యవేక్షించారు. గ్రామంలో 15 ఇళ్ల నిర్మాణానికి పిల్లర్లు తీసి బేస్‌మెంట్‌కు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సాధులతండాలో నీటి ఎద్దడి దృష్ట్యా చేతిపంపు రిపేరులో ఉండగా కొత్త పంపును బిగించినట్లు ఎంపీడీఓ తెలిపారు. జమ్గి(బీ)లో నర్సరీలోని మొక్కలు పరిశీలించారు. విత్తనాల జర్మినేషన్ పరిశీలించి మొక్కల పెంపకం వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు శిరీష, లింగయ్య, సంతోషి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ నానునాయక్ పాల్గొన్నారు.

పాఠశాల రికార్డులు స్వాధీనం

- సీఎల్ రాసినా.. బిల్లులు చేసుకున్న వైనం
- తొమ్మిది నెలలుగా పత్తాలేని మిడ్‌డే మీల్స్ రికార్డులు
- హెచ్‌ఎం రేఖారాణిపై ఎంఈఓ అసహనం



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ రహీమొద్దిన్

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని దెగుల్‌వాడి ప్రాథమికోన్నత పాఠశాల రికార్డులు మంగళవారం ఎంఈఓ ఎండీ రహీమొద్దిన్ స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులు గత ఆగస్టు నుంచి పత్తా లేకుండా పోయాయి. ప్రభుత్వం మిడ్‌డే మీల్స్ కోసం పంపిణీ చేసిన సామగ్రికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవు. పాఠశాలకు రాని రోజుల్లో ఉపాధ్యాయుల హాజరు పట్టికలో ఎంపీడీఓ లేక స్పెషల్ అధికారులు సీఎల్ రాసినా.. దానిపై సంతకాలు చేసి బిల్లులు చేసుకున్నట్లు ఎంఈఓ ఆకస్మిక పరిశీలనలో తేలింది. ఈ విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేఖారాణిని వివరాలు అడగగా పొంతన లేని సమాధానాలతో సిబ్బందిపై ఫిర్యాదులు చేస్తూ.. తప్పించుకునే ప్రయత్నం చేసింది. దీంతో ఎంఈఓ ఎండీ రహీమొద్దిన్ అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై డీఈఓ వేంకటేశ్వర్లును ఫోన్‌లో వివరణ కోరగా రికార్డుల పరిశీలనతో పాటు ఎంఈఓ నివేదిక ఆధారంగా హెచ్‌ఎంపై చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు.

ఖైదీలకు సరైన భోజనం అందించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్



భోజనాన్ని పరిశీలిస్తున్న రమేష్

సంగారెడ్డి టౌన్ : జైలులోని ఖైదీలకు సరైన భోజనం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం కందిలోని సెంట్రల్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీలకు కనీస వసతులు కల్పించాలని, సమయానికి బైల్స్, ములాఖత్ అందించాలన్నారు. అనంతరం జైలు ఆవరణలో తిరిగి పరిసరాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఖైదీల కోసం వండే కూరగాయలు, రూంలను తనిఖీలు చేసి భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ. 2 వేల చొప్పున, ఐదుగురికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఇంధనం ధరలు పెంచడం దారుణం

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం



జహీరాబాద్: అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుతుంటే ఒకే రోజున పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచడం దారుణమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం విమర్శించారు. బీజేపీ వచ్చినప్పటి నుంచి వీటి ధరలను పెంచుతూనే వస్తున్నారన్నారు. ఎక్సైజ్ ట్యాక్సుల పేరిట ధరలు పెంచడం సామాన్యుడి నడ్డి విరచడమేనని అన్నారు.

అధునాతన పరిజ్ఞానంపై అవగాహన

ప్రొఫెసర్ బ్రాండెన్ బర్గ్

పటాన్‌చెరు: ప్రపంచ ప్రఖ్యాత ఆడియో టెక్నాలజీ మార్గదర్శకుడు, బ్రాండెన్ బర్గ్ ఆడియో రంగంలో చోటుచేసుకుంటున్న అధునాతన పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో (ఈఈసీఈ) మంగళవారం సిగ్నల్ ప్రాసెసింగ్, అంతర్జాతీయ కెరీర్ అభివృద్ధి రంగాల విశిష్ట వక్తలతో నిపుణుల ఉపన్యాసాల శ్రేణిని నిర్వహించింది. ఆడియో కోడింగ్ పరిణామం, శ్రవణ అవగాహనలో పురోగతి, మ్యూజిక్ ఇన్స్పిరేషన్ రిట్రీవల్ (ఎంఐఆర్), స్పేషియల్ ఆడియో, హెడ్ ఫోన్ ఆధారిత లిజనింగ్ టెక్నాలజీల వంటివి ఉద్భవిస్తున్న ధోరణులను బ్రాండెన్ బర్గ్ వివరించారు. 2026 నాటికి క్యూ 4లో ప్రారంభించే బిల్ట్–ఇన్ హెడ్–ట్రాకింగ్ సెన్సార్ కొత్త హెడ్ ఫోన్ ఉత్పత్తి కోసం ప్రణాళికలను వెల్లడించారు.

ఉపాధి కూలి రూ.800 చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న నర్సింలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజుకు రూ.800 కూలి చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రేజింతల్, కంభాలపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు 11శాతం, నిరుద్యోగం 7శాతం పెరిగిందని చెప్పిన కేంద్ర ప్రభుత్వ గణాంకాలను పక్కన పెట్టి ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.7 పెంచడం సిగ్గు చేటన్నారు. మండుటెండలో ఉపాధి హామీ పథకం ద్వారా పని చేస్తున్న కూలీందరికీ తాగునీరు, నీడతో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు, టెంట్లు, గడ్డపారలు ఇతర పనిముట్లు అందజేయాలన్నారు. ఉపాధి పనులు కల్పిస్తున్నా కూలి గిట్టుబాటు కాక హైదరాబాద్, బొంబాయి, బెంగళూరు, పూణె తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏసోబు, ఆంజనేయులు, శివకుమార్, మల్లేశం, చంద్రయ్య, భరత్, రాములు,వెంకటేశం రాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

డీఎల్‌పీఓ అమృత



కూలీలతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అమృత తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయాలని జహీరాబాద్ డీఎల్‌పీఓ అమృత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బర్దీపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ప్రారంభించని వారు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. చేపట్టిన ఇళ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. ఉపాధిహామీ పనులకు హాజరైన కూలీలకు తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నర్సరీని పరిశీలించి మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, ఎంపీఓ స్వాతి, ఏపీఓ రాజ్‌కుమార్, కార్యదర్శి శిల్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలని వినతి



తహసీల్దార్ ఆశాజ్యోతిని సన్మానిస్తున్న రైతులు

కంది(సంగారెడ్డి): తమ భూసమస్యను పరిష్కరించాలని కంది రైతులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. నూతనంగా బదిలీపై వచ్చిన తహసీల్దార్ ఆశాజ్యోతిని మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ పేరుతో భూములను తీసుకొన్న అధికారులు ఎకరాకు 600ల గజాల ప్లాటు ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని వాపోయారు. కందిలోని సర్వే నంబర్ 656లోని అసైన్డ్ భూములను తీసుకొని తమకు పరిహారం ఇవ్వలేదన్నారు. జీవనాధారమైన భూములను ప్రభుత్వం తీసుకోవడంతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి భూసమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, భిక్షపతి, దుర్గయ్య, పద్మారావు, దానయ్య, సాయిలు, మల్లేశం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బోర్గి సంజీవ్

నారాయణఖేడ్: రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కులు, రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కంగ్టి మండలం బోర్గికి చెందిన ఉద్యమకారుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోర్గి సంజీవ్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. పక్షం రోజుల క్రితం కల్హేర్ మండలం మాసానిపల్లి వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు లారీలకు సంబంధించి కేసులు నమోదు చేసి.. మరో లారీని అధికారులు రక్షించే ప్రయత్నం చేశారని కలెక్టర్‌కు వివరించారు. విషయం బయటకు పొక్కడంతో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. మూడు లారీల్లో 90 టన్నుల పీడీఎస్ బియ్యం ఉండగా అధికారులు తక్కువ చూపారని ఆరోపించారు. ఈ బియ్యం ఖేడ్ ప్రాంతంలోని రైసుమిల్లులకు వచ్చినట్లు తెలుస్తుంది. అధికారులు మాత్రం మహారాష్ట్ర వెళ్తున్నట్లు కేసు నమోదు చేశారని చెప్పారు. రైసుమిల్లర్లు సైతం అక్రమార్కులకు ఊతమిస్తూ లబ్ధిపొందుతున్నారని వాపోయారు. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టుపడ్డ బియ్యం గన్నీబస్తాల్లో ఉండడంతో ఏ గోడౌన్ నుంచి తరలించారో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని పల్వట్ల గ్రామానికి చెందిన చెల్మెట్టి సుప్రియకు రూ.60వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరయింది. మంత్రి దామోదర ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరారెడ్డి మంగళవారం బాధితురాలికి చెక్కును అందజేశారు. కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని పేదవారికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రవీందర్ కల్యాణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమన్వయ లోపం.. ప్రజల పాలిట శాపం

- రహదారి విస్తరణలో భాగంగా మ్యాన్‌హోల్స్ ధ్వంసం
- పట్టణంలో నిండిపోతున్న డ్రైనేజీలు



రహదారిని ఆనుకుని ధ్వంసమైన మ్యాన్‌హోల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆర్అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారుల సమన్వయ లోపం రామచంద్రాపురం ప్రజల పాలిట శాపంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో డ్రైనేజీ సమస్య పొంచి ఉంది. రామచంద్రాపురం పట్టణంలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. జాతీయ రహదారి అనుకుని వర్షం నీరు పోయేందుకు బాక్స్ కల్వర్టును నిర్మిస్తున్నారు. రామచంద్రాపురంలోని నెహ్రూ విగ్రహం వద్ద బాక్స్ కాల్వర్టు నిర్మాణం కోసం జేసీబీతో కాల్వను తవ్వారు. ఆ సమయంలో డ్రైనేజీ ప్రధాన మ్యాన్‌హోల్స్‌తో పాటు ప్రధాన పైపులైన్ తవ్వి అందులో మట్టిని నింపటంలో డ్రైనేజీ సమస్య తలెత్తింది. దీంతో పాటు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ప్రధాన డ్రైనేజీ పైపులైన్‌ను సైతం రోడ్డు నిర్మాణ సమయంలో మూసివేయడంతో పాత రామచంద్రాపురం, శ్రీనివాస్‌నగర్ కాలనీ వరకు డ్రైనేజీ మ్యాన్‌హోల్ పూర్తిగా నిండిపోయాయి. ఈసంఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదాని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు రోడ్డుపై పొంగిపొర్లుతుంది. మరికొన్ని చోట్ల ఇళ్లలోని బోరులోకి డ్రైనేజీ నీరు చేరుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజులుగా డ్రైనేజీ సమస్య జఠిలంగా మారుతున్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదాని స్థానికులు మండిపడుతున్నారు. ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో మరిన్ని కాలనీలకు డ్రైనేజీ ప్రమాదం పొంచి ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో సమస్యకు పరిష్కారం

జాతీయ రహదారిని అనుకుని డ్రైనేజీ పైపులైన్ ధ్వంసమైన ఘటన వాస్తవమే. ఈ విషయంపై జాతీయ రహదారుల అధికారులు స్పందించారు. త్వరలో పూర్తిస్థాయిలో పైపులైన్ వేస్తున్నారు. సమస్య పరిష్కారమవుతుంది.

– శివకృష్ణ, డీజీఎం, జలమండలి

సంక్షిప్త వార్తలు

◆ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

జహీరాబాద్ టౌన్: బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్ గ్రామంలో మంగళవారం పార్టీ పిలుపు మేరకు జైభీం, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని ప్రజలంతా సమానమేనని, కులాలకు అతీతంగా రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. అంతకు ముందు గ్రామంలో భారీర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యురాలు ధనలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మక్సూద్, మహిళా అధ్యక్షురాలు అస్మా తబసుం పాల్గొన్నారు.

◆ చిన్నారులకు కంటి పరీక్షలు

నారాయణఖేడ్: డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే ఆరేళ్లలోపు చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా కంటి పరీక్షల శిబిరాలు మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని రాధాకృష్ణ మందిరం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నిజాంపేట పీహెచ్‌సీ వైద్యులు డా.తరణి, డా.కనిశ్రీ, మురళీ కృష్ణ, ఆర్‌బీఎస్‌కే మెడికల్ అధికారులు డా.బాలరాజు, డా.సుశీల్ కుమార్, జెట్ల భాస్కర్ కంటి పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సంధ్యారాణి శిబిరాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ నాగేశ్వరి, ఏఎన్‌ఎం లలిత తదితరులు పాల్గొన్నారు.

◆ కేదార్‌నాథ్ జగద్గురుకు సన్మానం

నారాయణఖేడ్: కేదార్‌నాథ్ ఆలయ జగద్గురు భీమాశంకర శివానంద శివాచార్య 1008 మంగళవారం ఖేడ్‌ను సందర్శించారు. ఖేడ్‌లో ఓ భక్తుడి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనను టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రేవణయ్యస్వామి, నాయకులు శ్రీనివాసరెడ్డి, జ్ఞాన్‌రెడ్డి, బస్వరాజ్, కొండల్‌రెడ్డి, బక్షిరాం, సంగమేష్, ఫయాజ్ తదితరులు దర్శించుకున్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌ను జగద్గురు శాలువాతో సన్మానించి ఆశీస్సులు పొందారు.

◆ విద్యార్థులకు బూట్లు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బూట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. దాతల సహకారంతో తమ వంతు బాధ్యతగా 560 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఏటా వేసవిలో విద్యార్థులకు పలు విషయాలపై సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నతస్థాయిలో స్థిరపడాలని కోరారు.

◆ అమ్మవారికి ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయికుమార్, కార్యకర్తలు ఏడుపాయల దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

◆ ఇళ్లలోకి చేరుతున్న మురికినీరు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కేంద్రంలోని ఎస్సీకాలనీలో ఇళ్లలోకి మురికి నీరు చేరుతుందని కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మురికినీరు వ్యవస్థలో భాగంగా మ్యాన్‌హోల్స్ నిర్మించారు. రోడ్డు కింది భాగంలో కాలనీ ఉంది. ఎత్తులో మురికినీరు మ్యాన్ హోల్స్ నిర్మించారు. పైనుంచి పారుతూ ఇళ్లలోకి మురికి నీరు చేరుతోందని వాపోయారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

◆ రామాలయానికి విముక్తి కల్పించాలి

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలోని రామాలయాన్ని కబ్జాదారుల చెర నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు ఆందోళన చేపట్టారు. మంగళవారం ఆలయం వద్దకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బైఠాయించారు. ఆలయ నిర్వహణ సేవల బాధ్యత గ్రామస్తుల ఆధీనంలోనే ఉండాలని గ్రామ ప్రజలు ప్రతిపాదించారు.